# వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 358 శనివారం | 24 ఆగస్టు 2024 | పేజీలు : 08 | వెల రూ. 5


6లో



## బీసీలు ఏకం కావాలి

హక్కుల సాధనకు ఉద్యమించాలి

బీపీ మండల్ జయంతిని జయప్రదం చేద్దాం

మేధోమథనం సదస్సులో వక్తల పిలుపు





## ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

ఉట్టికొట్టి ఉత్సాహం పంచిన బాలలు

లోపలి పేజీల్లో..



# మూగబోయిన సప్తస్వరాలు



**శిథిలావస్థలో సరిగమపదని పార్క్**

**ధ్వంసమైన ఉపకరణాలు**

**కిందపడి విరిగిన రాతి స్వాగత తోరణం**

**అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన వైనం**

దక్షిణ భారత దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఓరుగల్లులో ఏర్పాటు చేసిన 'సరిగమపదని' సంగీత ఉద్యానవనం ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలమవుతోంది. శిల్ప కళలకు పుట్టినిల్లుగా విరాజిల్లిన వరంగల్ నగరంలో గుడి, గుట్ట, గుండం కాన్సెప్ట్‌తో ఏర్పాటు చేసిన సంగీత ఉద్యానవనం పాలకుల ఆదరణకు నోచుకోవడం లేదు. రాతితో నిర్మించిన స్వాగత తోరణం కూలిపోయి రెండు ముక్కలైంది. భువనేశ్వర్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన సరిగమపదని వాయిద్యాలు కనిపించకుండా పోయాయి. గ్రీనరీ మచ్చుకైనా కానరావడంలేదు. హనుమకొండ జిల్లాలోని పద్మాక్షి గుట్ట సమీపంలో రూ.50లక్షలతో ఏర్పాటు చేసిన పార్క్‌ను ఫిబ్రవరిలోనే ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో అభివద్ధి పనులు అటకెక్కాయి. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులవైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో సంగీత ఉద్యానవనం శిథిలావస్థకు చేరింది. అందులో ఏర్పాటు చేసిన విద్యుత్ ఉపకరణాలను ఆకతాయిలు ధ్వంసం చేశారు. అసాంఘిక కార్యక్రమాలకు ఇది అడ్డాగా మారింది. గంజాయి, గుట్కా బ్యాచ్‌లకు ఆవాసమైంది. స్థానిక ఎమ్మెల్యే, కుడా అధికారులు స్పందించి పార్క్‌ను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు 2లో..

8లో..

## రెగ్యూలర్ లోనే డిప్యూటేషన్.!

డోర్నకల్ సీడీపీఓ కార్యాలయంలో వింత

దివ్యాంగ ఉద్యోగినిపై కక్ష సాధింపు

అర్హత ఉన్న అధికారిని వదిలి జూనియర్‌కు అందలం

పొలిటికల్ నీడలో సీడీపీఓ పోస్ట్

ఇబ్బందులు పడుతున్న క్రింది సిబ్బంది



## హామీల అమలులో వేగం పెంచాలి

- రుణమాఫీ త్వరితగతిన పూర్తి చేయాలి
- లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

2 లో..

# మూగబోయిన సప్త స్వరాలు



**శిథిలావస్థలో సరిగమపదని పార్క్**

**ధ్వంసమైన ఉపకరణాలు**

**కిందపడి విరిగిన రాతి స్వాగత తోరణం**

**అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన వైనం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** సప్త స్వరాలకు ప్రతీక 'సరిగమపదని' సంగీత ఉద్యానవనం. భారత దేశంలోనే రెండో సంగీత ఉద్యానవనం కాగా దక్షిణ భారత దేశంలోనే మొట్ట మొదటి ఉద్యానవనం ఇది. ఇంతటి ప్రాశస్తం కలిగిన ఈ ఉద్యానవనాన్ని హనుమకొండలోని పద్మాక్షి దేవాలయానికి సమీపంలో గుడి, గుట్ట, గుండం కాన్సెప్ట్ తో అందంగా డిజైన్ చేశారు. మధ్యలో కళాకారులు ప్రదర్శనలు ఇచ్చేందుకు వీలుగా ఎత్తైన వేదికలాగా గ్రీనరీతో ఏర్పాటు చేయగా చుట్టూ ఏడు నృత్య భంగిమలతో నృత్య కారినుల అందమైన శిల్పాలను అమర్చారు. సంగీత ఉద్యానవనం ప్రవేశ ద్వారం వద్ద నృత్యం చేస్తున్న రెండు స్వాగత విగ్రహాలను ఏర్పాటు చేశారు. పచ్చదనంతో నిండిన పార్క్ లో వివిధ ఆకారాల్లో ఉన్న ఏడు నృత్య భంగిమలు చూపరులను కట్టిపడేసేలా అమర్చారు.

### భువనేశ్వర్ నుంచి దిగుమతి..

భువనేశ్వర్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన సరిగమపదని వాయిద్యాలను ఈ పార్క్ లో ఏర్పాటు చేయడంతో పాటు ఆహ్లాదాన్ని వెదజల్లే విధంగా గ్రీనరీ, పలు రకాల పూల మొక్కలను నాటారు. ప్రతి నృత్య భంగిమ అందరినీ ఆకట్టుకునేలా గ్రానైట్ బేస్ పైన ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో అందంగా కనిపించేలా రంగు రంగుల ఎల్ఈడీ విద్యుత్ దీపాలను అమర్చారు. నిత్యం స్థానికులు, బాటసారులు వచ్చి సేద తీరేందుకు వీలుగా రాతితో తయారు చేసిన బల్లాలను ఏర్పాటు చేశారు. సెలవు రోజుల్లో కళా ప్రదర్శనలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా దీనిని తీర్చి దిద్దారు. ఇది కళాకారులకు గొప్ప వరం అంటూ కితాబిచ్చారు.

### స్వాగత తోరణం ధ్వంసం..

రాతితో నిర్మించిన సరిగమపదని సంగీత ఉద్యాన వనం స్వాగత తోరణం ధ్వంసం అయింది. దీనికి అనుబంధంగా ఏర్పాటు రాతి నిర్మాణాలు కూడా కూలిపోయాయి. వివిధ పూల మొక్కల కోసం ఏర్పాటు చేసిన కుండీలు మొక్కలు లేకుండానే కనిపించాయి. నగరానికి మరింత శోభను తీసుకురావాలన్న లక్ష్యంతో రూ.50లక్షలతో ఏర్పాటు చేసిన సంగీత ఉద్యానవనం ప్రారంభం కాకుండానే శిథిలావస్థకు చేరుకుంది.

### కుడా అధికారులు స్పందించాలి..

పాలకుల నిర్లక్ష్యంతోనే సంగీత ఉద్యానవనం శిథిలావస్థకు చేరిందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. రూ.50లక్షలు బూడిదలో పోసిన పన్నీరుగా మారుతున్నాయంటున్నారు. ఇప్పటికైనా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పంతాలకు పోయి గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను అటకెక్కించకుండా ప్రజోపయోగమైన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇందుకు స్థానిక ఎమ్మెల్యేతోపాటు, కుడా చైర్మన్, వైస్ చైర్మన్ కూడా చొరువ చూపాలంటున్నారు.











# హామీల అమలులో వేగం పెంచాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీల విషయంలో ఒక్క అడుగు ముందుకు రెండు అడుగులు వెనుక్కి అన్న రీతిలో అమలవుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. అర్హులైన రైతులందరికీ రైతు భరోసా అందించాలని, పంటల బీమా పథకం, కొత్త రేషన్ కార్డులు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, పింఛన్ల పెంపు లాంటి హామీల అమలుకు తక్షణం చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు భరోసాకు సంబంధించి ఖరీఫ్ సీజన్ నగం పూర్తయినా కూడా విధివిధానాల కోసం అభిప్రాయ సేకరణ పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ధరణి స్థానంలో కొత్తగా రూపొందించిన ఆర్ఓఆర్ చట్టం ముసాయిదాపై మరింత లోతుగా చర్చించి, అందరి అభిప్రాయాలు తీసుకుని చట్టం తీసుకురావాలని ఆయన సూచించారు. శనివారం జరిగిన ముగింపు సమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు హామీ సక్రమంగా కొనసాగుతున్నదని హర్షం వ్యక్తం చేశారు. అయితే ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంచుతూ చేసిన హామీ, ఆరోగ్యశ్రీ బకాయిలు ఉన్న నేపథ్యంలో ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదని కూనంనేని సాంబశివరావు అన్నారు. 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ.500 లకు గ్యాస్ సిలిండర్ హామీలు కొంతవరకు అమలవుతున్నా, పేదలందరికీ రేషన్ కార్డులు లేకపోవడం, పలు సాంకేతిక కారణాల నేపథ్యంలో ఈ హామీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడంలేదన్నారు.



### ముగిసిన సమావేశాలు..

హనుమకొండలో మూడు రోజుల పాటు నిర్వహించిన సీపీఐ రాష్ట్ర సమితి నిర్మాణ సమావేశాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా భవిష్యత్ రాజకీయ పోరాట కార్యాచరణను రూపొందించారు. రాజకీయ, సామాజిక అంశాలపై సమావేశంలో సభ్యులు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. భవిష్యత్ రాజకీయ కార్యాచరణను నిర్ణయించారు. సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కెళ్లపల్లి శ్రీనివాస్, ఎన్.బాలమల్లేష్, ఇ.టి.నరసింహా, కలవేణ శంకర్, ఎం.బాలనరసింహా తదితర నాయకులు పాల్గొన్నారు.

# గవర్నర్ పర్యటన సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు

## జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**వరంగల్ వాయిస్, ములుగు :** రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటనకు త్వరితగతిన, పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గవర్నర్ జిల్లా పర్యటనలో భాగంగా లక్నవరం సరస్సు, ఐర్లాండ్ సందర్శించనున్న నేపథ్యంలో సుందరీకరణ పనులను ఆయన శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ఐర్లాండ్ లోని గదులను శుభ్రం చేయాలని, శానిటేషన్ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గవర్నర్ పర్యటనలో ఎటువంటి లోటు పాట్లు లేకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, సీహెచ్.మహేందర్ రెడ్డి, ఈఈ పంచాయత్ రాజ్ అజయ్ కుమార్, డీఈ ఎలక్ట్రిసిటీ నాగేశ్వరరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# రుణమాఫీపై ఏదీ చిత్తశుద్ధి

## రైతులతో కలిసి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్నా



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, రాష్ట్రంలో సగం మందికి కూడా రుణమాఫీ చేయకపోవడం సర్కారు చిత్తశుద్ధిని చెప్పకనే చెబుతున్నదని పరకాల మాజీ శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శనివారం హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం ఆత్మకూరు మండల కేంద్రంలో రైతు ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తప్పుడు ప్రచారాలు చేసి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. రుణమాఫీపై ప్రభుత్వంలోని మంత్రులు ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఈ పద్ధతి మార్చుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. తప్పుడు ప్రచారాలతో రైతులను ఆగం చేసి మళ్లి మోసం చేయవద్దని సూచించారు. రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో అయ్యే వరకు రైతుల పక్షాన బీఆర్ఎస్ రణం కొనసాగుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే రైతుల మీద మీకు ప్రేమ ఉంటే సొసైటీలు, బ్యాంకులలో పర్యటించి ఎంతమంది రైతులకు రుణమాఫీ చేశారో, ఇంకా ఎంతమందికి చేయాలో లెక్కలు తీయండన్నారు. ఆత్మకూరు సొసైటీలో అక్రమాలు జరుగుతున్నాయని, అక్రమాలకు పాల్పడ్డ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దామెర,ఆత్మకూరు మండలాల రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుడికి విద్యుత్ శాఖ చెక్కు అందజేత

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** పరకాల నియోజకవర్గం గీసుగొండ మండలం నందనాయక్ తండా గ్రామనికి చెందిన బదావత్ ఈశ్వర్ గత కొద్ది రోజుల క్రితం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై గాయపడగా విద్యుత్ శాఖ నుంచి మంజూరైన రూ.3 లక్షల 60 వేల చెక్కును శనివారం హనుమకొండ భవాని నగర్‌లోని తన నివాసంలో బాధితుడికి పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి అందజేశారు. ఈశ్వర్ కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు.

# మార్వాడీల మహా పాదయాత్ర



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణ కేంద్రంలో శనివారం పట్టణ కేంద్రానికి చెందిన మార్వాడీ సోదరులు మహబూబాబాద్ జిల్లాలోని ఇల్లంద గ్రామంలో గల బాబా రాందేవ్ దేవస్థానానికి పాదయాత్రగా బయలుదేరడం జరిగింది. ఈ సందర్భంగా మార్వాడి సంఘం పెద్దలు కేవీ సింగ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తొర్రూరు, తిరుమలగిరి, అడ్డ గూడూర్ గ్రామానికి చెందిన మార్వాడి సోదరులు ప్రతి సంవత్సరం తొర్రూరు పట్టణ కేంద్రం నుంచి పాదయాత్రగా బయలుదేరి ఇల్లంద గ్రామంలోని బాబా రాందేవ్ దేవాలయానికి చేరుకొని తాము మొక్కిన ముక్కులను తీర్చుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ పాదయాత్ర నెల్లికుదురు వయా మహబూబాబాద్ మీదుగా ఇల్లంద పట్టణానికి ఆదివారం సాయంత్రానికి చేరుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చేతన్ సింగ్, మగ్గా రామ్, అశోక్, ప్రకాష్, భరత్, మార్వాడి సోదరులు పాల్గొన్నారు.

# పరకాల మున్సిపాలిటీని సుందరీకరణ చేయాలి



## ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో అధికారులు, కౌన్సిలర్లు తో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరకాల మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులను సమన్వయం చేస్తూ ముందుకెళ్లాల్సిన మున్సిపల్ పాలకవర్గం నిర్లక్ష్యం వీడాలని, పనులను స్పీడప్ చేస్తూ పనులు చేయించాల్సిన అధికారులు అనుకున్న స్థాయిలో పని చేయడం లేదని ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు అసహనం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కేటాయించిన నిధులు ప్రణాళిక బద్ధంగా అత్యవసర పనులకు వినియోగించి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పరకాల మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని తాను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి కోరడం జరిగిందని, ఇటీవల ఇంచార్జి మంత్రి పరకాలకు వచ్చి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయడంతో పాటు, కొత్త అభివృద్ధి పనులను ప్రణాళికా బద్ధంగా చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా నీటిని సరఫరా చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. మున్సిపాలిటీలో పెండింగ్ పనులను త్వరలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పని చేయాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరించరాదాని హెచ్చరించారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను 69 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసిన మహబూబాబాద్ శాసనసభ్యుడు డాక్టర్ భూక్యా మురళి నాయక్ ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబాద్ నియోజకవర్గంలోనే ఐదు మండలాలకు గాను మొత్తంగా, మహబూబాబాద్ మండలం కింద 15 మంది లబ్ధిదారులకు రూ. 4 లక్షల,27000 వేలు, గూడూరు మండలం మొత్తం 10మంది లబ్ధిదారులకు గాను రూ. 2లక్షల,51వేల500, కేసముద్రం మండల కేంద్రంలోని 13 మంది లబ్ధిదారులకు గాను రూ.4 లక్షల 17 వేల 500 లను, నెల్లికుదుర్ మండల కేంద్రంలోని 14 మంది లబ్ధిదారులకు గాను రూ. 4 లక్షల71వేలు, మానుకోట టౌన్ గాను 17మంది లబ్ధిదారులకు గాను రూ. 5లక్షల 46వేల 500లు ఎమ్మెల్యే చేతుల మీదుగా వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల అధ్యక్షులు, డీసీసీ ఉపాధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మహబూబాబాద్ పలు వార్డుల వార్డు కౌన్సిలర్లు, యూత్ నాయకులు కార్యకర్తలు లబ్ధిదారుల పాల్గొన్నారు.

# కూనంనేనిని కలిసిన మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హరిత హోటల్ లో జరుగుతున్న సీపీఐ నిర్మాణ మహాసభల సందర్భంగా హాజరైన సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావును శనివారం మర్యాద పూర్వకంగా కలిసి వంట కార్మికుల సమస్యలపై స్పందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకత్వాన్ని తీసుకొని పోవాలని కోరారు. దానికి వారు సానుకూలంగా స్పందించి వారు తప్పనిసరి తీసుకువెళతానని, పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి, ధర్మల రామ్మూర్తి, రాష్ట్ర సమితి సభ్యులు గడ్డం లలిత, హనుమకొండ జిల్లా సమితి సభ్యులు, మేకల హేమలత, నర్ర రమ, మాటూరి స్వరూప, మంతుర్తి శోభ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

## బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వ్యవసాయ కార్మికులకు సమగ్ర కేంద్ర శాసనం చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని కార్యాలయంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశానికి మునిగాల భిక్షపతి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రాములు ప్రసంగిస్తూ రెక్కాడితే కానీ డొక్కాడని వ్యవసాయ కార్మికులు ఎలాంటి హక్కులు లేకుండా అత్యంత దుర్భరంగా జీవిస్తున్నారని, వీరి జీవితాలలో వెలుగులు నింపేందుకుకేంద్ర ప్రభుత్వం సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టాన్ని చేసి అమలు పరచాలన్నారు. మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడి ఉపాధి కూలీలకు సంవత్సరంలో రెండు వందల రోజులు పనులు కలిగించి రోజుకు రూ.700 కూలి ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12, 000 ఇస్తామన్న వాగ్దానాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే అమలు జరపాలన్నారు. బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య ప్రసంగిస్తూ రేషన్ కార్డులు లేని వారందరికీ వెంటనే ఇవ్వాలని, ఆసరా పెన్షన్స్ నాలుగు వేలకు పెంచాలని, అర్హులైన వారందరికి పోడు భూములకు పట్టాలివ్వాలని, ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఆరు లక్షల రూపాయలు అందించాలన్నారు. డిమాండ్ల సాధనకు సెప్టెంబరు 5న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ముందు జరిగే ధర్నాలను పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సీనియర్ నాయకులు మోతే లింగారెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బొట్టు భిక్షపతి, కొట్టే భిక్షపతి, మంద సుమన్, మునిగాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

శనివారం 24, ఆగస్టు 2024
www.warangalvoice.net

# 510 జీఓ ఉద్యోగులందరికీ అమలు చేయాలి

## ఎన్‌హెచ్‌ఎం నేత రామ రాజేష్ ఖన్నా



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** 510 జీఓ ఎన్ హెచ్ఎం ఉద్యోగులందరికీ అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి హరిత కాకతీయ హెూటల్లో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా కలిసి వినతిపత్రం అందజేశారు. వరంగల్ జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగింది. గన్నారపు రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4000 మందికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని, వెంటనే 4000 మందికి న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు సమస్యలను వివరించారు. ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ప్రకారం సమాన పనికి సమాన వేతనం వెంటనే ప్రకటించాలన్నారు. 2018 నుంచి 2024 వరకు 510 జీవో అందరికీ అమలు చేయాలి, పీఆర్సీ ఏరియర్స్ 7 నెలలు వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలి, మహిళా ఉద్యోగులకు 180 రోజులతో వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, ప్రతి నెల 1న జీతాలు ఇవ్వాలని, హెల్త్ కార్డ్స్, హెల్త్ ఇన్సూరెన్స్ వర్తించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. క్యాడర్ ఫిక్సేషన్ చేయాలని, ఎన్ హెచ్ఎంలో 65 సంవత్సరాలు నిండిన వారికి రిటైర్ మెంట్ ప్రకటించి ఉద్యోగి ఒక నెల పెన్షన్ రూ.25వేలు ఇచ్చేటట్టుగా ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దామెర కృష్ణ, హనుమకొండ జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, సుమ, హనుమకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్మూర్తి, హనుమకొండ ఆయూష్ ఎస్ఎన్ ఓలు ఇందిరా, కళావతి, నవీన్, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

# జానపద కళల్ని కాపాడుకుందాం..

## టీఆర్‌జేకేఎస్ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల రమేష్



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర కమిటీ ఆదేశానుసారం పరకాల పట్టణంలోని అమరధామంలో సంబరాలు నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీఆర్ జేకేఎస్ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల రమేష్ ముదిరాజ్ విచ్చేసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం తాళ్ల రమేష్ ముదిరాజ్ మాట్లాడుతూ దినమంతా కాయ కష్టపడుతూ కర్షకుడికి పొద్దు తిరుగుతూనే ఇంటివైపు మరలి సంకటో అంబలో నోట్లో వేసుకొని, తన ఇంటి ముంగిట మట్టి అరుగుపై జారగిల బడుకొని తనకొచ్చిన కూని రాగములు, పల్లెటూరి పడుచులు తమ ఇండ్ల రోళ్ల యొద్ద ధాన్యమును దంపునపుడు, తమ ఇండ్లలో పిండ్లు తిరగలితో విసరుచూ, తమ భర్తలకు, అన్నదమ్ములకు సహాయపడుచు పైర్లలో కలుపు తీయుచు, నిద్రకై ఏడ్చేడి పాపాయిల జోకొట్టుచును పాడేటి పాటలే జానపదాలన్నారు. ఈ జానపదాలే సంగీత రచనల అభివృద్ధికి పునాదని ఈసందర్భంగా గుర్తుచేశారు. ప్రతి ఒక్కరికి ప్రపంచ జానపద దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నిమ్మల రాజు, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూర్ణయ్య, వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు మాటేటి రజిత, హనుమకొండ జిల్లా మహిళా అధ్యక్షురాలు జన్ను రజిత, తదితర కళాకారులు పాల్గొన్నారు

# సీసీ కెమెరాలే.. శ్రీరామరక్ష

## సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళుతున్నప్పుడు పక్కవారికి చెప్పి వెళ్లాలని, మామూలు తాళాలకు బదులు మెయిన్ డోర్లకు సెంట్రల్ లాకింగ్ ఏర్పాటు చేసుకుంటే తలుపుకు తాళం వేసినట్లు గుర్తించటం ఇతరులకు కష్టమని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. నగరంలో మధ్యప్రదేశ్ దొంగల ముఠా సంచరిస్తున్నట్లు పోలీసు శాఖ వారి హెచ్చరికలతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఒక సీసీ కెమెరా పదిమంది మనుషులతో సమానమని, ప్రతి కాలనీలో కాలనీ కమిటీ సభ్యులు విధిగా సీసీలు ఏర్పాటు చేసుకోవాలని కనీసం గృహస్తులు అయినా సొంతంగా కేవలం మూడు వేల రూపాయలు వెచ్చిస్తే ఆన్ లైన్ లో సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయని, దానిని నెట్ సహాయంతో మన మొబైల్ కు అనుసంధానం చేసుకొని భద్రత పొందవచ్చునన్నారు. ముఖ్యంగా అపార్ట్ మెంట్ వారు వారి వాచ్ మెన్ ను రాత్రివేళలో అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరించాలని, అపార్ట్ మెంట్లకు వచ్చే వాళ్ల వివరాలను సెల్ నెంబర్లను రిజిస్టర్ లో రాశాకే ఫ్లాట్ల లోకి అనుమతించాలని సూచించారు. ఊర్లకు ఎక్కువ రోజులు వెళ్ళవలసి వస్తే స్థానిక పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా జరగరాని సంఘటన ఏదైనా జరిగితే వెంటనే దగ్గరలోని పోలీసులు కంప్లైంట్ చేయాలని ఆయన సూచించారు.

# ఇంటి తాళం పగులగొట్టి చోరీ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఇంటికి తాళాలు వేసి దంపతులు తాము చేసే చిరు వ్యాపారాలు చేసోవడానికి వెళ్లి తిరిగి వచ్చే సరికి దొంగలు తాళాలు పగుల గొట్టి ఇంటి లోనికి చొరబడి బీరువాలో దాచిన తులం బంగారాం, తులం వెండి ఆభరణాలు, రూ. 7 వేల నగదు చోరీ చేసిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నరసింహ నగర్ లో చోటుచేసుకుంది. ఇంటి యజమాని నాముని మురళీ కృష్ణ తన భార్య మంజుల స్థానికంగా చిరు వ్యాపారాలు చేయడానికి ఇంటికి తాళాలు వేసి తిరిగి వచ్చేసరికే దొంగలు తాళాలు పగులగొట్టి ఇంట్లో కి చొరబడి తులం బంగారు, తులం వెండి ఆభరణాలతో పాటు, 7 వేల రూపాయల నగదు చోరీ చేశారని భాదితుడు కన్నీరు మున్నీరయ్యారు. చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామన్నారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు.

# కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, నార్లాపూర్ మాజీ ఉప సర్పంచ్ కొమరవెల్లి సదానందం, గౌడ సంఘం నాయకులు ఒనగోని చంద్రమౌళి పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లోనై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్ల చిన్ని, మండల సమన్వయ కమిటీ సభ్యులు పెద్దబోయిన రవీందర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు పనులను ప్రారంభించిన నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నియోజకవర్గ పరిధిలోని 5వ వార్డు కొత్తూరు జెండాలో రూ. 40లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణం, సీసీ డ్రైన్, రోడ్డు మరమ్మత్తుల నిర్మాణ పనులకు శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక కాలనీ వాసులతో ముచ్చటించారు. రోడ్డు నిర్మాణంలో ప్రజల సహకారం ఉండాలని, దూరదృష్టితో రోడ్డు పనులకు అటకం లేకుండా చూడాలని తెలిపారు. శంకుస్థాపన చేసిన పనులను సకాలంలో అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. వార్డులో నీళ్ల (పాత పైపుల వలన ) సమస్య ఉందని మహిళలు తెలియజేయడంతో వెంటనే తక్షణ మరమ్మత్తులకు నిధులను కేటాయించారు. అనంతరం వార్డులో ఉన్న పోచమ్మ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, మాజీ కార్పొరేటర్ విద్యాసాగర్, నల్లబోలు సతీష్, డివిజన్ అధ్యక్షురాలు స్రవంతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్, నాయిని లక్ష్మారెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు ముప్పిడి శ్రవణ్, సతీష్, కాలనీ అధ్యక్షులు రాజేశ్వర్ రావు, సురేష్, వేణు, రమేష్, వెంకటేశ్వర్లు, బంక రాకేష్, యూత్ నాయకులు రాకేష్, సత్యనారాయణ, ప్రశాంత్, శుభాష్,సీనియర్,కాంగ్రెస్ పార్టీ సీనియయ్ నాయకులు, మహిళా నాయుకురాళ్లు, యువజన నాయకులు, కాలనీ వాసులు, అధికారులు పాల్గొన్నారు.

# రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ డ్రామాలు

## అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేసి తీరుతాం

## అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేనీ రవీందర్ రావు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాజకీయ లబ్దికోసం బీఆర్ఎస్ పార్టీ రుణమాఫీ మీద లేని పోనీ అపోహలు సృష్టించి రైతులను ఆందోళనకు గురిచేస్తుందనీ తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. ఈ సందర్భంగా శనివారం చైర్మన్ మార్నేని రవీందర్ రావు మాట్లాడుతూ మొన్నటి వరకు అధికారంలో ఉండి రైతు సమస్యలపైన ఏమాత్రం పట్టింపు లేని బీఆర్ఎస్ నాయకులు నేడు రోడ్ల మీదకు వచ్చి ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. దేశ చరిత్రలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకునీ రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేయడం జరిగిందని తెలిపారు. ప్రజల ఆశీస్సులతో అధికారంలో వచ్చాక 2 లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన మాట కట్టుబడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో రుణమాఫీ కోసం 31 వేల కోట్లు ఆమోదింపజేసి రుణమాఫీ జీవో తీసుకురావడం జరిగిందన్నారు. ఇంత పెద్ద ఎత్తున రుణమాఫీ చేస్తుంటే ఓర్వలేని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ మీద అనవసరమైన నిందలు వేస్తుందని మండిపడ్డారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ ఆగిపోయిన రైతులకు రుణమాఫీ చేసే బాధ్యత ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మి రైతులు ఎవరు ఆందోళనకు గురి కావద్దన్నారు. ఇది రైతు ప్రభుత్వం రైతుల క్షేమం కోరే ప్రభుత్వమని తెలిపారు.

# బంగ్లాదేశ్‌లో హిందూ టీచర్లపై దాడులు సరికాదు



**వరంగల్ వాయిస్, రేగొండ :** బంగ్లాదేశ్ లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడినప్పటికి హిందువులపై దాడులను ఖండిస్తున్నట్లు టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు ములుకల్ల తిరుపతి తెలిపారు. బంగ్లాదేశ్ హిందూ టీచర్లపై దాడులకు వ్యతిరేకంగా టీపీయూఎస్ రేగొండ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో తమ నిరసనను తెలియజేశారు. అదే విదంగా పశ్చిమ బెంగాల్ లో జూనియర్ డాక్టర్ పై అత్యాచారానికి కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు దేశంలో మరెక్కడా పునరావృతం కాకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పడిదల భాస్కర్ రావు, జిల్లా, మండల తపస్ నాయకులు విజయ్ కుమార్, బాపురెడ్డి, మనోహర్, లక్ష్మయ్య, స్వప్న, శ్రీలత, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీపై ఎమ్మెల్యే మురళి నాయక్ సమీక్ష



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీపై మహబూబాద్ జిల్లా అగ్రికల్చర్ ఏఓ అధికారులతో మహబూబాబాద్ శాసనసభ్యుడు డాక్టర్ భూక్యా మురళి నాయక్ క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశాన్నినిర్వహించారు. రైతులు రెండు లక్షల రుణమాఫీ మూడు విడుదల్లో తీసుకున్న ఆయా లిస్టులో రాని వారి పేరును మళ్లీ సవరించి తక్షణమే వాటిపైన చర్యలు చేపట్టి వారికి రైతు రుణమాఫీ జరిగే విధంగా చొరవ చూపాలన్నారు. అలాగే రేషన్ కార్డు లేకున్నా సరే భూమి ఉండి బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతుకు కచ్చితంగా రుణమాఫీ కావాల్సిందేనని అధికారులకు సూచించారు. అలాగే బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తూ రైతులను రెచ్చగొడుతు వారితో ధర్నాలు చేపిస్తూ ఉన్నారని, తక్షణమే రైతుల తోటి సమీక్షలు నిర్వహించి వారి దరఖాస్తులను స్వీకరించి త్వరతగతిన వారికి రుణమాఫీ జరిగే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతు రుణమాఫీ విషయంలో రైతులు ఎవ్వరు గానీ, అధైర్య పడనవసరం లేదని, కచ్చితంగా బ్యాంకులో రైతు రుణం తీసుకున్న వారికి రుణమాఫీ చేసి తీరుతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ ఒక్క రైతును నష్టపోకుండా కాపాడుకునే బాధ్యత మా ప్రజా ప్రభుత్వానిది అన్నారు. కాబట్టి, రైతులు బీఆర్ఎస్ నేతల మాటలు విని రోడ్ల పై ధర్నాలకు దిగొద్దని కోరారు. ఎవరైనా సరే కలెక్టర్ కార్యాలయంలో గానీ, బ్యాంకు అధికారులతో గానీ, లేదా తహసీల్దార్ ఆఫీస్ లో, తన దగ్గరకు సమస్యలుంటే తక్షణమే తీసుకురావాల్సిందిగా కోరారు. యుద్ధ ప్రతిపాదికన మీ రైతు రుణమాఫీ జరుగుతుందన్నారు.

## మొగుళ్లపల్లిలో కూరగాయల మార్కెట్ వేలం

### రూ. 35,500లకు దక్కించుకున్న నిమ్మల సారయ్య



**వరంగల్ వాయిస్, మొగుళ్లపల్లి :** మొగుళ్లపల్లిలో ప్రతి శుక్రవారం కూరగాయల మార్కెట్ ను నిర్వహించేందుకు తాజా మాజీ సర్పంచ్ మోటే ధర్మన్న విశేష కృషి చేశారు. అనతి కాలంలోనే అభివృద్ధి చెందిన మొగుళ్లపల్లిలో నిర్వహించే కూరగాయల మార్కెట్ సంతకు వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేలంపాటలో 17 మంది పాల్గొనగా మొగుళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన నిమ్మల సారయ్య రూ.35,500 లకు వేలంపాటను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా నిమ్మల సారయ్య మాట్లాడారు. సంతకు వచ్చే వ్యాపారవేత్తలు, స్థానిక వ్యాపారులు, ప్రజలందరూ పూర్తి స్థాయిలో సహకరించి కూరగాయల మార్కెట్ అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి సునీత, పంచాయతీ సెక్రెటరీ నరేష్, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకులం విద్యార్థులు



**వరంగల్ వాయిస్, మడికొండ :** మడికొండలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బీ కుమారస్వామి శనివారం తెలిపారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. సీనియర్స్ విభాగంలో బి.పవన్‌తేజ, కె.ఆనంద్, ఎం.మహెూన్నత్, జూనియర్స్ విభాగంలో ఎ.కీర్తన్‌రాజ్, బి.అశ్వంత్, కె.మహేశ్వర్, ఎన్.చందర్, బి.అజిత్‌కుమార్ సెప్టెంబర్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. విద్యార్థులను సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ యూ.వీరాచారి, పీడీ రమేశ్, పీఈటీ నిరంజన్, జూనియర్ ప్రిన్సిపాల్ రాజు, ఉపాధ్యాయులు డి.రాజేంద్రప్రసాద్, సదానందం, శ్రీనివాసులు, ఎల్ విజయలక్ష్మి అభినందించారు.

## నవోదయలో కృష్ణాష్టమి వేడుకలు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాలలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గోపిక, కృష్ణుని వేషాధారణలో కార్తీక్, రిత్విక్, నేహాన్స్, భేష్ కుమార్, గోపిక వేషధారణలో శాన్వి వినయ్ అలరించారు. ఈ కార్యక్రమంలో నవోదయ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, దర్శకురాలు మామిడి అనురాధ, పృథ్వీ, ఉపాధ్యాయ బృందం శివకుమార్, వెంకట్, రాజేందర్, సందీప్, స్వాతి, ప్రసూన, మాధవి, విద్యా, జయ, సంధ్య, జోష్న, మౌనిక, సౌమ్య పాల్గొన్నారు.

## వృద్ధులకు సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు వరం

### అనురాగ్ సొసైటీ చైర్మెన్ అనితా రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ బెంచ్ మెంబర్, అనురాగ్ సొసైటీ చైర్మెన్ డాక్టర్ అనితా రెడ్డి వివిధ వృద్ధ ఆశ్రమాలు సందర్శించారు. హనుమకొండలోని లార్డ్ వృద్ధాశ్రమం, సాయి వృద్ధ ఆశ్రమం, బోగవెల్లి వెలమ సంక్షేమ వృద్ధ ఆశ్రమంలో ఉన్న వారికి వృద్ధుల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వృద్ధ ఆశ్రమంలో ఇస్తున్న సౌకర్యాలు, వారి సాధక భాధకాలు వృద్ధులను అడిగి తెలుకున్నారు. అనంతరం జిల్లా సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ బెంచ్ మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ట్రిబ్యునల్ బెంచ్ వృద్ధులకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. వివిధ వృద్ధాశ్రమాలలో ఉన్న వారు తమకు ఎవరు లేరని, ఒంటరి వారిమనే దిగులు చెందవద్దని, వృద్ధులకు చేయూతనివ్వడానికి అందరం ఉన్నామని అన్నారు. నేటికాలంలో వయోవృద్ధులను వేధించడం, నిర్లక్ష్యం చేయడం అనేది ఎక్కువగా జరుగుతుందని, ఈ విషయం బయట ప్రపంచానికి చెప్పలేని సమస్యగా రూపుదాల్చిందని ఆవేదన వెలిబుచ్చారు. వయో వృద్ధుల పట్ల సానుభూతితో కాకుండా సహానుభూతితో చర్యలు అందించాలని కోరారు. వేధింపులకు గురైన వయోవృద్ధులు తగు సలహా పునరావాసం నిమిత్తం 14567 టోల్ ఫ్రీ నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఆశ్రమాలు నడిపేవారు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడపాలని, లైసెన్స్ తీసికొని నడపాలని, విధిగా లైసెన్స్ లు రెన్యూవల్ చేయించుకోవాలని, ఫైల్స్, సీసీ కెమెరాలు మెయింటెన్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వయోవృద్ధులకు పండ్లు అందించారు. డాక్టర్ చంద్రమౌళి, దేవాచారి, సరళ, ఆశ్రయ నిర్వహకులు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా నోవా అగ్రి గ్రూప్ రిటైలర్స్ మీట్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నోవా అగ్రి గ్రూప్, అయ్యప్ప ఆగ్రో ఏజన్సీస్, వరంగల్ వారి ఆధ్వర్యంలో వరంగల్ లో రిటైలర్స్ మీట్ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నోవా అగ్రి గ్రూప్ తరపున అయ్యప్ప ఆగ్రో ఏజన్సీస్ -వరంగల్ యజమాని మధుసూదన్ రెడ్డిని కంపెనీ డిస్ట్రిబ్యూటర్‌గా పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో నోవా అగ్రిటెక్ డైరెక్టర్ చెరుకూరి రాజేష్ మాట్లాడుతూ ఈ జనవరి 22న నోవా అగ్రిటెక్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ద్వారా మార్కెట్లోకి అడుగుపెట్టి విజయవంతంగా రూ.144 కోట్లను సమీకరించి, షేర్ మార్కెట్‌లో లాభాల బాటలో నడుస్తుందన్నారు. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధుల నుంచి రూ.14.20 కోట్లతో కొత్త ఫార్ములేషన్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. నోవా అగ్రి గ్రూప్ సౌత్ ఇండియా-నేషనల్ మార్కెటింగ్ మేనేజర్ కె. హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగా మార్కెట్లోకి ప్రవేశపెట్టబడిన నూతన ఉత్పాదనలు సమర్ధవంతంగా పనిచేస్తున్నాయని, రాబోయే కాలంలో కూడా మరిన్ని నాణ్యమైన ఉత్పాదనలను తయారు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. తెలంగాణ జోనల్ మేనేజర్ ప్రశాంత్ మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా బలమైన డీలర్ నెట్‌వర్క్‌తో నోవా అగ్రి గ్రూప్ రైతు సోదరులకు అందుబాటులో నాణ్యమైన ఉత్పాదనలను అందిస్తుంది. దీనికోసం సహకరిస్తున్న డీలర్ మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. మీరు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ప్రతి నిత్యం కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నోబుల్ సతీష్, క్రాంతి రమేష్, రావుల అనిల్ సహా తదితరులు 160 మంది హాజరయ్యారు.

## ప్రత్యేక వృద్ధాప్య వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** జాతీయ ఆయూష్ మిషన్ లో భాగంగా ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్య బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక వృద్ధాప్య వైద్య శిబిరం 'GERI ATRIC HEALTH CAMP' వరంగల్‌లోని కాశిబుగ్గ తిలక్ రోడ్డు కేవీఎస్ ఫంక్షన్ హాలులో నిర్వహించి 200 మంది వృద్ధులకు వైద్య సేవలు అందించి ఉచిత మందులు ఇచ్చారు. ఈ ప్రత్యేక వృద్ధాప్య వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రారంభ సమావేశానికి కోన్ రెడ్డి మల్లారెడ్డి సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ సమావేశ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం పురాణ కాలం నుంచి బహుళ ప్రచారంలో ఉన్నదని తెలిపారు. వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ హాస్పిటల్ సూపరింటెంట్ జి.పద్మావతి మాట్లాడుతూ అనంత లక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేదిక్ హాస్పిటల్ లో నిత్యం 300కు పైగా అవుట్ పేషెంట్స్ వైద్య సేవలు పొందుతున్నారని, ఉచిత మందులు తీసుకుంటున్నారని తెలిపారు. సీనియర్ వైద్యులు డాక్టర్ హరి కిషన్ వైద్య సీనియర్ వైద్యులు డాక్టర్ వసంత, డాక్టర్ శ్వేత,డాక్టర్ జ్యోతి, డాక్టర్ కమల కుమారి, హౌస్ ఫ్రేజేసియాన్స్ డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ అంజలి వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జాతీయ ఆయుష్ మిషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రవణ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఫార్మసిస్టులో ఓదేలు దయాకర్, అజర్ పాషా వృద్ధులకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమం సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు మల్లారెడ్డి, ఎన్ సదానందం ప్రధాన కార్యదర్శి, కందుల గోవర్ధన్ ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రెటరీ గుర్రపు నరసింహా రాములు, సలహాదారులు రాజేంద్రప్రసాద్, రాజమౌళి, సహాయ కార్యదర్శులు మంత్రి లింగమూర్తి, జోగి రెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## జానపద ఉద్యమ కళాకారులను ప్రభుత్వమే ఆదుకోవాలి




**వరంగల్వాయిస్, హనుమకొండ :** జానపద ఉద్యమ కళాకారులను ప్రభుత్వమే ఆదుకోవాలితెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజా నాట్యమండలి హనుమకొండ జిల్లాముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జానపద వృత్తి కళాకారులకు ప్రభుత్వం వెంటనే ఆరోగ్య, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అదేవిధంగా కళలను ప్రోత్సహించే దిశగా జానపద కళారూపాలతో అవార్డులు ప్రకటించాలని, ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని కోరారు. అంతరించిపోతున్నజానపద కళల్ని, సాహిత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జానపద, పౌరాణిక, యక్షగానం, ఒగ్గు కథ, కోలాటం, ఒగ్గుడోలు, చిరుతల భజన, గుస్సాడి, మధుర ఆదివాసి, గిరిజన సంస్కృతులను కాపాడుకోవాలని అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కేతరాజు ఉప్పలయ్య, ఉపాధ్యక్షులు కన్నము లక్ష్మీనారాయణ, ఆరెల్లి రవి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కొట్టెపాక రవి, అధ్యక్షుడు గడ్డం, రాజనర్సు, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర కృష్ణ, బత్తుల సుప్రియ, అముడాల సుమలత, రెంటాల శ్యాం, పల్లె రామ, బైరపాక అనిత తదితరులు పాల్గొన్నారు.

# తప్పు చేస్తే ఎవరైనా ఉపేక్షించేది లేదు

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పదేళ్ల సుదీర్ఘ పోరాటాల నడుమ కార్యకర్తల శ్రమ, ప్రజల నమ్మకంతో నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన వారికే పదవులు ఉంటాయని హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థానిక ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన 8నెలల తరువాత మొదటి సారి సమావేశం నిర్వహించుకుంటున్నామని, అసెంబ్లీ ఎన్నికల్లో, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అధికారం కోసం, తన గెలుపుకోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి రానున్న రోజుల్లో సముచిత స్థానాలు ప్రభుత్వ పరమైనవి, పార్టీ పరమైనవి కల్పిస్తానని అన్నారు. ప్రజలు మనకు అనితర బాధ్యతలు ఇచ్చిన తరుణంలో కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్, డివిజన్ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, ప్రజల సమస్యలను తెలుసుకోవాలని తెలిపారు. అందరికీ ఒకేసారి పదవులు రాకపోయినా ఎవరు అధైర్య పడవద్దని, పనిచేసే ప్రతి ఒక్కరిని గుర్తించి బాధ్యతలు కల్పిస్తానని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలను డివిజన్ వారీగా నివేదికలు తయారుచేయాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ కావ్య గెలుపులో భారీ మెజారిటీ ఇవ్వడం పట్ల ఏఐసీసీ హర్షం వ్యక్తం చేసిందన్నారు. ఎమ్మెల్యే గా గెలిచిన తరువాత నిత్యం ప్రజల మధ్యనే ఉంటున్నానని, ప్రజా సమస్యల నిర్మూలన కోసం నేనెప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పుల్ల పద్మ, పీసీసీ సభ్యులు బట్టి శ్రీనివాస్ రాయి, ఈవీ శ్రీనివాస్ రావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్‌లు పోతుల శ్రీమాన్, జక్కుల రవీందర్, మానస రాంప్రసాద్, మామిండ్ల రాజు, విజయశ్రీ సయ్యద్ రజాలి, ఏనుగంటి రాములు, మాజీ కార్పొరేటర్లు,మాజీ కార్పొరేటర్లు బుద్ధ జగన్, దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, బోడ డిన్న, నాగరాజు,అశోక్, రావుల సదానందం, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బంక సంపత్, అనుబంధ సంఘాల అధ్యక్షులు బంక సరళ, పెరుమాండ్ల రామకృష్ణ, అజీజ్ ఉల్లా బేగం, పల్లకొండ సతీష్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాయిని లక్ష్మా రెడ్డి, ఎండీ అంకుస్, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మేరీ, సరళ, కొంటె సుకన్య, స్రవంతి, రహీమున్నిసా, డివిజన్, వార్డు అధ్యక్షులు, యువజన సంఘాల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మున్సిపల్ కార్మికుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలని శనివారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ లో సీపీఐ రాష్ట్ర నిర్మాణ సమావేశాల సందర్భంగా సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికుల డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. దీనికి నారాయణ స్పందిస్తూ మున్సిపల్ పారిశుధ్య, ఔట్ సోర్సింగ్ కార్మికులు శ్రమ దోపిడీ కి గురవుతున్నారని, వీరికి కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసు రత్నం, టీఎంఆర్పీఎస్ వ్యవస్థాపకుడు బొట్ల భిక్షపతి మాదిగ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, వరంగల్ మున్సిపల్ జేఏసీ వ్యవస్థపాక కార్యనిర్వహక అధ్యక్షుడు ఏ.ధర్మరాజు, ఐఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు పుల్ల రమేష్, జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజరపు భాస్కర్, మున్నంగి రఘు, వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్క ఏలీయా, వై మూర్తి రాజు, డి.దామోదర్, కృష్ణ స్వామి, సురేందర్, మిట్టపల్లి సతీష్, పోగుల వసుమతి, నద్దునూరి రేణుక, బొట్ల పుష్ప, పసుల కోమల, పారిశుద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు

## ములుగులో ఘనంగా బాలగోకులం



**వరంగల్ వాయిస్, ములుగు :** సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యప్రదర్శనలతో చిన్నారుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని, శ్రీకృష్ణ, గోపికల వేషధారణలతో చిన్నారులు అద్భుతమైన ప్రదర్శన చేశారని జిల్లా రోడ్డు రవాణా శాఖ జిల్లా అధికారి సిరాజ్ అహ్మద్ అన్నారు. శనివారం ములుగులోని తంగేడు స్టేడియంలో బాలగోకులం ఉత్సవ సమితి అధ్యక్షుడు గండ్రకోట కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రీయ సేవికా సమితి ప్రతినిధి వాంకుడోతు జ్యోతి, నూనె భిక్షపతి, సన్‌రైస్ స్కూల్ కరస్పాండెంట్ పెట్టెం రాజు, జోహార్ స్కూల్ కరస్పాండెంట్ ఎండీ.జావీద్, బ్రాహ్మణి స్కూల్ కరస్పాండెంట్ కర్ర రాజేందర్ రెడ్డి, బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ కోటి రెడ్డి, సెయింట్ ఆథోనీస్ స్కూల్ కరస్పాండెంట్ కవిత, బిట్స్ స్కూల్ ప్రిన్సిపల్స్ కొలగాని రజినీకాంత్, గిరిగాని కవిత,మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శోభారాణి, సాధన స్కూల్ కరస్పాండెంట్ సురేందర్ రెడ్డి, లిటిల్ ఫ్లవర్ ప్రతినిధి కృష్ణ, అరవింద పాఠశాల కరస్పాండెంట్ అక్కల సతీష్, భవాని స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస రావులతోపాటు ధర్మజాగరణ ఉత్సవ సమితి సభ్యులు రవిరెడ్డి, రామగిరి శ్రీనివాస్, మంద మహేష్, రాయంచు నాగరాజు, మమన్, శ్రీతన్, జస్వంత్, సాయిరాం, సాత్విక్, అభినయ్, రాము, నవనీత్, తదితరులు పాల్గొన్నారు.

# బీసీలు ఏకం కావాలి

## బీపీ మండల్ జయంతిని జయప్రదం చేద్దాం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రేపు బీపీ మండల్ జయంతి సందర్భంగా బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో పారడైజ్ ఫంక్షన్ హాల్ లో బీసీల సమర శంఖారావం-బీసీల మేధోమథనం సదస్సు నిర్వహిస్తున్నట్లు బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్ లో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి మండల్ మనవడు సూరజ్ యాదవ్, వివిధ పార్టీల మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నారు. యావత్ బీసీ ప్రజలు, ప్రొఫెసర్లు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, మేధావులు, కుల సంఘాల నాయకులు, వివిధ కులాల ప్రతినిధులు, ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. బీసీల హక్కుల కోసం, కుల గణనపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు, కామారెడ్డి డిక్లరేషన్ పై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని అమలు చేసే విధంగా ప్రయత్నాలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల హక్కులను సాధన కోసం-మన వాటా కోసం కొట్లాడుదామని, బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాడుదామని తెలిపారు. ఈ దేశ స్వతంత్ర ఉద్యమ అనంతరం జరిగిన ఎన్నో ఉద్యమాలు వాటి లక్ష్యాన్ని చేరుకున్నాయని, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ ఉద్యమాలు సఫలం అయ్యాయన్నారు. నేడు రాజకీయ, సామాజికంగా వెనకబడి ఉన్నది బీసీలు మాత్రమేనన్నారు. నేడు బీసీలు వారి హక్కుల కోసం కొట్లాడాల్సి ఉందని, ఈ తరుణంలో బీసీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులాల వారీగా జన గణణ చేపట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయించాలని, కామారెడ్డి డిక్లరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం అమలు చేయాలని, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్ర బడ్జెట్‌లో 10 లక్షల కోట్లు కేటాయించాలని, కేంద్ర ప్రభుత్వంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలంతా పార్టీలకు, సంఘాలకు అతీతంగా వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రాబోవు రోజుల్లో బీసీ ఉద్యమాన్ని ఓరుగల్లు కేంద్రంగానే ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వరంగల్ సభ్యుడలు ప్రొ.గడ్డం భాస్కర్, ప్రొ.విజయబాబు, దారం జనార్ధన్, ప్రొ.కృష్ణ బెనర్జీ, వేణుమాధవ్ గౌడ్, తాడిశెట్టి క్రాంతి కుమార్, పులి రజినీకాంత్ ముదిరాజ్, గుర్రపు రవీంద్ర గౌడ్, గొల్లపెల్లి వీరస్వామి, గోలి సుధాకర్ మున్నూరు కాపు, బుద్దే వెంకన్న, మాచర్ల శరత్ చంద్ర, పోలపెల్లి రామ్మూర్తి, గండ్రకోట రాకేష్ యాదవ్, నలబోలా రవికుమార్ సగర, కృష్ణ యాదవ్, మహేందర్, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఏకశిల ప్రైమ్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**వరంగల్ వాయిస్, దామెర:** దామెరలోని ఏకశిల ప్రైమ్ పాఠశాలలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కోలాహలంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలలో పాల్గొన్న ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి మాట్లాడుతూ పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. కృష్ణుడు, గోపిక వేషధారణలతో వచ్చిన విద్యార్థులను, రకరకాల వస్తువులతో పిల్లన గ్రోవి తయారుచేసిన విద్యార్థులను అభినందించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ మణికుమార్, స్టాఫ్ ఇంచార్జి విజయ్ కుమార్, జరీనా, జ్యోత్స్న, సుమాంజలి, మౌనిక, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## అరవింద పబ్లిక్ స్కూలులో..



**వరంగల్ వాయిస్, ఖిలావరంగల్ :** ముకుందా ముకుందా...రారా కృష్ణయ్య రారా కృష్ణయ్య అంటూ రాధాకృష్ణుల వేషధారణలో వచ్చినటువంటి విద్యార్థులు చేసిన ఆటపాటలు అందరిని అలరించాయి. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయుల్లో ఉత్సాహాన్ని, ఆనందాన్ని నింపాయి. వరంగల్ నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేటలో గల అరవింద పబ్లిక్ స్కూల్ లో ప్రిన్సిపాల్ పంచకం రమాదేవి ఆధ్వర్యంలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా పాఠశాల కరస్పాండెంట్ పంచకం నర్సయ్య హాజరై కృష్ణాష్టమి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను చిన్నప్పటి నుంచే విద్యార్థులలో కలిగేలా ఇలాంటి వేడుకలను ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులు ఎంతో గొప్పగా తమ రాధాకృష్ణుల వేషధారణలో వచ్చి ఉట్టి కొట్టి వేడుకలను ఎంతో వైభవంగా జరుపుకున్నారన్నారు. శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ముందుగానే తమ పాఠశాలలో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అందరికీ కృష్ణాష్టమి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీలు అశ్విని, నర్మద, యాస్మిన్, స్వప్న, రజిత, దివ్యశ్రీ, జహర, అఫ్రీన్, సిమ్రాన్, సుష్మిత, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ హైస్కూల్‌లో..





**వరంగల్ వాయిస్, హనుమకొండ :** శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా నారాయణ హైస్కూల్ వరంగల్ ఒలంపియాడ్ బ్రాంచ్ నక్కలగుట్టలో పాఠశాల ప్రిన్సిపాల్ వంగల అలేఖ్య ఆధ్వర్యంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి .ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీజీఎం రిజ్వానా మాట్లాడుతూ శ్రీ కృష్ణుడు గొప్ప తెలివైన వాడని, గీతా సారాంశాన్ని కూడా తానే స్వయంగా చెప్పడం గొప్ప అంశంగా చెప్పవచ్చన్నారు. అదేవిధంగా స్కూల్లో చదువుకుంటున్న విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో, నృత్య ప్రదర్శనలో అందర్నీ ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్స్ సాయి కృష్ణ, హారిక, శిరీష, అకాడమీ డీన్ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపల్స్ షాహిని, కరుణశ్రీ, ఏవో నాగరాజు, పీఈటీ చిర్ర సుమన్ గౌడ్ తదితర ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.


# మరింత బెస్ట్‌గా చూపిస్తాం

## అర్షద్ వార్సీ వ్యాఖ్యలకు స్పందించిన నాగ్ అశ్విన్





బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సీ వ్యాఖ్యలపై కల్కి దర్శకుడు నాగ్ అశ్విన్ స్పందించారు. 'కల్కి' సినిమాలో ఓ సన్నివేశాన్ని పోస్ట్ చేసిన నెటిజన్.. ఈ ఒక్క సీన్ బాలీవుడ్ ఇండస్ట్రీ మొత్తంతో సమానం అని క్యాప్షన్ పెట్టారు. ఈ పోస్ట్‌పై నాగ్‌అశ్విన్ స్పందిస్తూ.. టాలీవుడ్, బాలీవుడ్ అని విడదీసి మాట్లాడొద్దన్నారు. 'నార్త్–సౌత్, టాలీవుడ్ వెర్సస్ బాలీవుడ్.. ఇలా పోలుస్తూ వెనక్కి వెళ్లొద్దు. మనమందరం ఒక ఇండస్ట్రీకి చెందినవాళ్లమే. అర్షద్ కొంచెం హుందాగా మాట్లాడాల్సింది. అయినా ఫర్వాలేదు. మేము అతడి పిల్లల కోసం 'కల్కి' బుజ్జి బొమ్మలు పంపిస్తాం. కల్కి రెండోభాగం కోసం మరింత కష్టపడి పనిచేస్తాను. అందులో ప్రభాస్‌ను బెస్ట్‌గా చూపిస్తాను అని రాసుకొచ్చారు. ప్రపంచంలో చాలామంది మనల్ని ద్వేషిస్తారు. కానీ, మనం వాటిని పట్టించుకోకుండా ముందుకెళ్లాలి అని నాగ్‌అశ్విన్ చెప్పారు. ప్రభాస్ కూడా ఇదే మాట అంటుంటారని ఆయన తెలిపారు. మరోవైపు ప్రభాస్‌పై అర్షద్ వార్సీ చేసిన కామెంట్స్ తీవ్ర చర్చనీయాంశం గా మారుతున్నాయి. వీటిని ఖండిస్తూ పలువురు సెలబ్రిటీలు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. తాజాగా ఈ అంశంపై 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు బాలీవుడ్ మూవీ అండ్ టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌కు లేఖ రాశారు. అభిప్రాయాల్ని వ్యక్తపరిచే హక్కు అందరికీ ఉన్నప్పటికీ, అర్షద్ చేసిన వ్యాఖ్యలు ప్రభాస్‌ని తక్కువ చేసేలా, వ్యతిరేకతకు కారణమయ్యేలా ఉన్నాయి. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఆయనకు సూచనలు చేస్తారని ఆశిస్తున్నాం. ప్రాంతం, భాషతో సంబంధం లేకుండా నటీనటులంతా గౌరవంగా ఉండాలని కోరుతున్నాం.



# ఆస్పత్రి నుంచి రవితేజ డిశ్చార్జ్

మాస్ మహారాజ రవితేజ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. సాఫీగా సాగిన సర్జరీ అనంతరం విజయవంతంగా డిశ్చార్జ్ అయ్యాను. తాను ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నానని, త్వరలోనే సెట్‌లో అడుగుపెట్టేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లుగా చెప్పారు. తన క్షేమాన్ని ఆకాంక్షిస్తూ మెసేజ్‌లు చేసిన వారందరికి ధన్యవాదాలు అంటూ రవితేజ రాసుకోచ్చాడు. రవితేజ 67 ప్రాజెక్ట్ షూటింగ్ సమయంలో రవితేజకు ప్రమాదం జరుగగా.. అతడి కుడిచేతికి గాయం అయ్యింది. అయితే నొప్పిభరిస్తునే షూటింగ్‌లో పాల్గోన్నాడు రవితేజ. అయితే షూటింగ్ అనంతరం ఈ గాయం ఎక్కువ కావడం వలన చిత్రబృందం ఆయనను ఆస్పత్రికి తరలించారు. రవితేజను పరిశీలించిన వైద్యులు ఆయనకు శస్త్రచికిత్స చేసి, ఆరు వారాల పాటు రెస్ట్ తీసుకోవాలని సూచించారు. ఇక రవితేజకు ప్రమాదం జరిగిందని తెలుసుకున్న అతని అభిమానులు ఆస్పత్రికి తరలివస్తున్నారు. తమ అభిమాన హీరో త్వరగా కోలుకోవాలని వేడుకుంటున్నారు.



# ఆగ్రా సన్నివేశాలు వైరల్

## సోషల్ మీడియా కామెంట్స్‌పై నొచ్చుకున్న రుహానీ శర్మ

రుహానీ శర్మ నటించిన 'ఆగ్రా'లోని కొన్ని సన్నివేశాలు నెట్టింట వైరల్ కావడంపె ఆమె అసహనం వ్యక్తంచేశారు. ఈ సినిమా కథ ఎన్నో అవార్డులను గెలుచుకుందని.. దాన్ని పట్టించుకోకుండా తన సన్నివేశాలను వైరల్ చేయడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రుహానీ నటించిన 'ఆగ్రా' గతేడాది విడుదలైంది. తాజాగా ఈ సినిమా ఓటీటీలోకి వచ్చింది. దీంతో కొందరు ఇందులోని బోల్డ్ సన్నివేశాలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. రుహానీ ప్రైవేట్ వీడియోస్ అంటూ వాటిని వైరల్ చేస్తున్నారు. దీనిపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ లేఖను విడుదల చేశారు. ఆగ్రా'లోని సన్నివేశాలు లీక్ అయినప్పటినుంచి నేను ఎంతో నిరుత్సాహంగా ఉన్నాను. నా బాధను వివరించడానికి నిరుత్సాహం అనేది కూడా చిన్నమాటే. మా కష్టాన్ని, అంకితభావాన్ని విస్మరించి కేవలం కొన్ని సన్నివేశాలను మాత్రమే వైరల్ చేయడం హృదయవిదారకంగా ఉంది. కళాత్మక చిత్రాలను రూపొందించడం ఎంతో పెద్ద సవాలు. వాటి కోసం నిద్ర లేని రాత్రులు గడపాలి. అలాంటి చిత్రాలను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి రక్తాన్ని చెమటగా మార్చాలి. కన్నీళ్లను అర్థం చేసుకోకుండా కొందరు దాని గురించి తప్పుగా మాట్లాడుతున్నారు. కొన్ని సన్నివేశాల ఆధారంగా సినిమాపై ఓ నిర్ణయానికి రాకూడదు. అది సరైన పద్ధతి కాదు. ఈ చిత్రాన్ని కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 2023లో ప్రదర్శించారు. చిత్ర బృందానికి దక్కిన గౌరవం అది. ఈ సినిమా అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. ఇంత గొప్ప ప్రాజెక్ట్‌లో వర్క్ చేసినందుకు నాకెంతో గర్వంగా ఉంది. ఈ సినిమా శైలిని అందరూ గుర్తించాలని కోరుతున్నాను. కళ ఎప్పుడూ సులభంగా, సౌకర్యవంతంగా ఉండదు. ఎన్నో భావోద్వేగాలతో ముడిపడి ఉంటుంది. కళాకారుల శ్రమను వృథా చేయకండి. సినిమా గొప్పతనాన్ని అర్థం చేసుకోండి' అని ఆ లేఖలో పేర్కొన్నారు.

# సరిపోదా శనివారం 29న విడుదల

## సెన్సార్ పూర్తి చేసుకున్నట్లు ప్రకటన

నాని కథానాయకుడిగా వస్తున్న తాజా చిత్రం 'సరిపోదా శనివారం' .. నాని 31గా వస్తున్న ఈ సినిమాకు వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తుండగా.. నాని సరసన ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తుంది. తమిళ నటుడు ఎస్‌జే సూర్య కీలక పాత్రలో నటిస్తున్నాడు. డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి హై బడ్జెట్, భారీ కాన్వాస్‌తో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఈ చిత్రం ఆగష్టు 29న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వరుసగా మూవీ ప్రమోషన్స్ చేస్తుంది.

అయితే తాజాగా ఈ చిత్రం సెన్సార్ పనులు పూర్తి చేసుకున్నట్లు నాని సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు. ఈ సందర్భంగా ఒక వీడియోను కూడా వదిలాడు. 'సరిపోదా శనివారం' సెన్సార్ కంప్లీట్ అయ్యింది. సెన్సార్ బోర్డ్ U/A సర్టిఫికెట్ ఇచ్చింది. అలాగే 2 గంటల 35 నిమిషాలు రన్ టైం అని నాని చెప్పగా.. వెనక నుంచి ఎస్‌జే సూర్య వచ్చి ప్లస్ 15 మినిట్స్ అంటాడు. మొత్తం 2 గంటల 50 నిమిషాలు అంటే సుందరానికి కూడా ఇదే రన్ టైం కదా అంటూ ఎస్‌జే సూర్య అనగా.. అంటే కాదు.. 'సరిపోదా శనివారం' అంటూ నాని అనడం ఇది ఒక యాక్షన్ మూవీ అండ్ లవ్ స్టోరీ అంటూ వీడియోను వదిలారు.





# షరతుల్లేకుండా రుణ మాఫీ చేయాలి

**మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యే చల్లా**

**కాపులకనపర్తి సొసైటీ ఎదుట రైతులతో కలిసి ధర్నా**

**వరంగల్ వాయిస్, పరకాల :** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని, ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ అమలు చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వరంగల్ జిల్లా సంగెం మండలం కాపులకనపర్తి సొసైటీ ఎదుట నిర్వహించిన రైతు ధర్నాలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ వైఖరితో రాష్ట్రంలోని రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వాపోయారు. రైతులకు ధైర్యం చెప్పాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి, ఎదుటివారిపై అనాలోచితంగా మాట్లాడుతూ నిరాశలో కొట్టుమిట్టాడుతున్నారని దుయ్యబట్టారు. ఉద్యమంలో రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు కేసీఆర్ ప్రభుత్వం అన్నీ అమలు చేసిచూపించిందని, దేశంలో గొప్ప రాష్ట్రంగా తీర్చిదిద్దిందని కొనియాడారు. ఇన్ని చేసిన కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారన్న ఆలోచనతోనే రేవంత్‌రెడ్డి ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఇప్పుడు ప్రజలు, రైతులందరూ కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చి తప్పు చేశామని బాధపడుతున్నారని, తాము ఎక్కడికి వెళ్లినా ఇదే విషయాన్ని మాట్లాడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో అధికార పక్షం ఎంత ముఖ్యమో ప్రతిపక్షం అంతకంటే ముఖ్యమని, కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నింటినీ అమలు చేసేదాకా బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ‘ఆల్ఫోర్స్’ను సీజ్ చేయాలి

**కళాశాల చైర్మన్ పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి**

**ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ పట్టణంలోని కొత్తవాడలో ఉన్నటువంటి ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకున్నా ప్రభుత్వ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా అడ్మిషన్ తీసుకొని అక్రమంగా జూనియర్ కళాశాలను నడిపిస్తున్న యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకొని క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఏఐఎఫ్ డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏఐఎఫ్‌డీఎస్) ముఖ్య కార్యకర్తల సమావేశానికి గడ్డం నాగార్జున ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ..వర్ధన్నపేటలో ఉన్నటువంటి ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల కోడ్‌ను ఉపయోగించి ఇక్కడ పర్మీషన్ ఉందని చెప్పి తల్లిదండ్రులను, విద్యార్థులను, ప్రభుత్వాన్ని నమ్మించి మోసం చేసి అడ్మిషన్ తీసుకొని నడిపిస్తున్నారని ఆరోపించారు. ఈ విధంగా తల్లిదండ్రులను మోసం చేస్తున్నటువంటి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా గత జూన్ 22 తేదీన కూడా అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ నుంచి స్థానిక డీఐఈఓకి కూడా మెమోరాండం ఇవ్వడం జరిగిందన్నారు. కానీ డీఐఈఓ తక్షణమే స్పందించి ఎంక్వయిరీ చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ కళాశాల యజమాన్యంతో లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకొని విచ్చలవిడిగా అడ్మిషన్లు తీసుకొంటున్నారని మండిపడ్డారు. అక్రమంగా జూనియర్ కళాశాల నడిపించే విధంగా స్థానిక వరంగల్ డీఐఈఓ తన వంతు సహకారం అందిస్తున్నారని విమర్శించారు. తక్షణమే ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలను సీజ్ చేసి నిర్లక్ష్యం వహిస్తున్నటువంటి డీఐఈఓపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఈ సందర్భంగా విద్యాశాఖకు హెచ్చరిక జారీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వస్సుల భరత్, రాష్ట్ర కోశాధికారి పోతిగంటి కాశి, వరంగల్ జిల్లా కార్యదర్శి జన్ను రమేష్ తదితరులు పాల్గొన్నారు

# జాతీయ అవార్డుల దరఖాస్తుల గడువు పొడిగింపు

**జిల్లా సంక్షేమ అధికారి రాజమణి**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం తరపున వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరచిన బాల బాలికలకు ప్రతి ఏటా ప్రధానం చేస్తున్న ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ జాతీయ అవార్డులకు ఔత్సాహిక బాల బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి బి.రాజమణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 సంవత్సరానికి గాను అందించనున్న రాష్ట్రీయ బాల పురస్కార్ జాతీయ అవార్డులకు నామినేషన్ల ప్రక్రియకు గతంలో ఇచ్చిన ప్రకారం 31 జులై చివరి తేదీ కాగా కేంద్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ సూచన మేరకు 31 ఆగస్టు వరకు పొడిగించినట్లు తెలిపారు. ఆన్ లైన్ లేదా ఆఫ్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 18 ఏళ్లలోపు బాల, బాలికలు ఆవిష్కరణ మరియు సృజనాత్మకత, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, కళలు, సంస్కృతి, సైన్స్ మరియు టెక్నాలజీ, ఇతర రంగాల్లో ప్రతిభ కనబరచిన బాలల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, అర్హులైన వారు తమ దరఖాస్తులను ఆగష్టు 31, 2024 లోపు ఆన్ లైన్లో http://awards.gov.in% వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆఫ్ లైన్ లో దరఖాస్తు చేసుకునే వారు సుబేదారిలోని బాల రక్షా భవన్ సెకండ్ ఫ్లోర్ ఆసుంతా భవన్ లో లేదా జిల్లా కలెక్టర్ కారాయలయం (సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయం (జి1, జి 2) లో సంప్రదించాలని రాజమణి పేర్కొన్నారు.

# రెగ్యులర్ లోనే డిప్యూటేషన్.!

**డోర్నకల్ సీడీపీఓ కార్యాలయంలో వింత**

**దివ్యాంగ ఉద్యోగినిపై కక్ష సాధింపు**

**అర్హత ఉన్న అధికారిని వదిలి జూనియర్‌కు అందలం**

**పొలిటికల్ నీడలో సీడీపీఓ పోస్ట్**

**ఇబ్బందులు పడుతున్న క్రింది సిబ్బంది**




**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ సీడీపీఓ పోస్టు రాజకీయ నాయకుల చేతుల్లో ఆట బొమ్మగా తయారైంది. డోర్నకల్ ప్రాజెక్ట్ సీడీపీఓగా దివ్యాంగురాలైన డి.లక్ష్మిని రెండు సంవత్సరాల క్రితం ప్రభుత్వం నియమించింది. అయితే కేవలం కొన్ని రోజులు మాత్రమే ఆమె ఆ సీట్ లో కూర్చోగా గత ప్రభుత్వ క్యాబినెట్ మంత్రి ఆమెను మానుకోట జిల్లా కేంద్రంలోని బాల రక్షక్ భవనంకు (బీఆర్బీ) కు డిప్యూటేషన్ పై పంపించి అక్కడ ఏసీడీపీఓగా విధులు నిర్వహిస్తున్న మంగమ్మను డిప్యూటేషన్ పై డోర్నకల్ లో నియమించారు.

**ఏమిటి వింత..!**

రెగ్యులర్ సీడీపీఓను డిప్యూటేషన్ పై పంపించి.. డిప్యూటేషన్ పై ఏసీడీపీఓను ఇక్కడికి తీసుకోరావటం వెనుక మతలబు ఏమిటో ప్రజలకు అర్థమైంది. ఇదిలా ఉండగా ఈ ప్రాజెక్ట్ పరిధిలో కొందరు అంగన్వాడీ టీచర్లు తమ విధులు సక్రమంగా నిర్వహించటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై కొందరు రాష్ట్ర డైరెక్టర్ కార్యాలయానికి, టోల్ ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేశారు. అయితే గతంలో ఇక్కడ ఇంచార్జిగా కొనసాగిన ఎల్లమ్మ ఆగస్ట్ 1న జరిగిన ప్రమోషన్ లో మరిపెడ ప్రాజెక్టుకు బదిలీ అయింది. కాగా అప్పటికే డోర్నకల్ ప్రాజెక్ట్ సీడీపీఓగా లక్ష్మి ఉండగా ఆ స్థానం బదిలీలో ఖాళీగా చూపించలేదు. దీంతో ప్రస్తుతం లక్ష్మి డోర్నకల్ సీడీపీఓగా కోనసాగుతున్నారు. కాని లక్ష్మికి ఆమె స్థానాన్ని ఆమెకు అప్పగించకుండా బాల రక్షక్ భవన్ లో డిప్యూటేషన్ పై ఉన్నట్లు అధికారులు చూపిస్తున్నారు. గత రెండు రోజుల క్రితం లక్ష్మిని ఆమె రెగ్యులర్ స్థానం డోర్నకల్ ప్రాజెక్ట్ లోనే తిరిగి డిప్యూటేషన్ పై నియమించారు. సీసీఏ, సబార్డినేట్ రూల్స్ తెలిసిన ఏ ఉద్యోగికి రెగ్యులర్ స్థానంలో డిప్యూటేషన్ ఏమిటీ.. అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

**తిరిగి వస్తా..!**

ఇదిలా ఉండగా డోర్నకల్ సీడీపీఓగా విధులు నిర్వహించిన ఓ అధికారిణి తిరిగి డోర్నకల్ రావటాలనికి మంకు పట్టు పడుతోంది. లక్ష్మికి ఇచ్చిన డిప్యూటేషన్ రద్దు చేసి డోర్నకల్ సీడీపీఓగా నియమించాలని అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతుందని సమాచారం. అంతే కాకుండా స్థానిక ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నట్లు తెలిసింది. రాష్ట్ర జేడీ కార్యాలయంలో బలంగా పావులు కదుపుతున్నట్లు వినికిడి. కాగా దివ్యాంగురాలైన లక్ష్మికి అన్యాయం జరిగితే సహించేది లేదని వికలాంగుల సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ఇదే జరిగితే వికలాంగుల తడాక చూపిస్తామంటున్నారు. జిల్లా ఆఫీస్ ఎదుటే తెల్చుకునేందుకు సిద్ధమౌతున్నారు.

# కార్పొరేటర్‌పై ‘కొండా’కు ఫిర్యాదు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 27 డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనిల్, చిలకల రాజుపై కొండ పటేల్ కాలనీ వాసులు శనివారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీకి ఫిర్యాదు చేశారు. వారిపై చర్య తీసుకోవాలని కోరారు. కొండ పటేల్ కాలనీలో కరెంటు మీటర్ల విషయంలో అక్రమాలు జరిగాయంటూ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన విషయాన్ని టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో కొడా మురళికి వివరించారు. కొండా పటేల్ కాలనీ అధ్యక్షుడు దౌడు నాగరాజ్, కమిటీ సభ్యులు రామగిరి శ్రీవిద్య, కొండపర్తి శ్రీలత, పాడిశెట్టి సరళా దేవి, ఒరుగంటి రేణుక, నాజియా రబ్బాని, ఓడపల్లి రాణి, దామెర కొండ విజయలక్ష్మి, ఓడపల్లి రవి, ఒంటెద్దుల శ్రీకాంత్, మల్యాల నాగరాజు, షేక్ సలీం, శ్యామల, మార్క్ ఎలగొండ శ్రీనివాస్ తోపాటు కొండ పటేల్ కాలనీ వాసులు పెద్ద మొత్తంలో తరలి వచ్చి స్థానిక 27 డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనిల్, చిలకల రాజుపై ఫిర్యాదు చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కొండ పటేల్ కాలనీలో కొండా దంపతుల నాయకత్వంలో అభివృద్ధి జరుగుతోందని కాలనీవాసులు తెలియజేశారు. ఇంత వరకు కాలనీ అభివృద్ధికి ఒక్క రూపాయి పని చేయని కార్పొరేటర్ ఇప్పుడు కాలనీకి వచ్చి సమస్యలు సృష్టిస్తున్నారని, కాలనీవాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com